క్లుప్తంగా

వైఎస్సార్‌బీమా తక్షణ సాయం అందజేత



నగదు అందజేస్తున్న కార్పొరేటర్ కొణతాల సుధ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం గొల్లవీధి ప్రాంతానికి చెందిన నమ్మి నూకరాజు మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని భార్యకు వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు బుధవారం అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపద సమయంలో బీమా ఆ కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చట్టి నూకరాజు,బూసి అప్పలరెడ్డి, పిలక వరలక్ష్మి, మంగ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌ను పరామర్శించిన మళ్ల



కార్పొరేటర్ యోగ క్షేమాలు తెలుసుకుంటున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం: అనారోగ్యం కారణంగా 60వ వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్ ఆస్పత్రిలో చేరారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి ఆయన యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ధైర్యంగా ఉండాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు దుర్గానగర్‌లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు బల్ల లక్ష్మణరావు బుధవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ గుత్తేదారులకు, వర్క్‌ఇన్‌స్పెక్టర్లకు పలు సూచనలు చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఆడారి ఆనంద్ కుమార్ సారథ్యంలో తమ వార్డు శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

డీజిల్ లోకోషెడ్‌లో డీఆర్‌ఎం తనిఖీలు



పరికరాలను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

తాటిచెట్లపాలెం : ఈస్ట్‌కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ బుధవారం డీజిల్ లోకో షెడ్‌లో పర్యటించి, అందుబాటులో గల వసతులు, పరికరాలను పరిశీలించారు. డీజిల్ లోకోలకు క్లచ్ ఒబర్ హాలింగ్ చేసే పవర్ అసెంబ్లీ బెంచ్‌ను పరిశీలించారు. అనంతరం స్మాల్ మోటార్ బెంచ్ సెక్షన్, మెటలర్జికల్ ల్యాబ్, న్యూ షెడ్‌లను పరిశీలించారు. ఆయా విభాగాల్లో గల సీనియర్ సూపర్‌వైజర్స్‌తో డీఆర్‌ఎం మాట్లాడారు. డీజిల్ లోకో షెడ్ నిర్వహిస్తున్న వివిధ అంశాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పర్యటనలో డీజిల్ లోకోషెడ్, ఎలక్ట్రికల్ విభాగం సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరపురాని మధుర క్షణాలు

చందమామ రావే.. అంటూ పాటలు పాడుకున్న రోజులు పోయాయి.. చందమామా వస్తున్నామనే రోజులు వచ్చేశాయి. ఇస్రో ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్–3 విజయవంతం కావడంతో యావత్ భారతావని సంబరాలు చేసుకుంటోంది. ఇది గర్వించదగిన అద్భుత ఘట్టమని అందరూ కొనియాడుతున్నారు.

- చంద్రయాన్ – 3 విజయవంతంపై అంతటా హర్షాతిరేకాలు



గోపాలపట్నం బాలికల హైస్కూల్‌లో విక్రమ్ సేఫ్ ల్యాండింగ్ ప్రత్యక్ష ప్రసారం



చంద్రయాన్–3 అక్షర రూపంలో గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

గోపాలపట్నం: 40 రోజుల ఉత్కంఠకు తెర దించుతూ విక్రమ్ ల్యాండర్ చందమామపై అడుగిడిన ఆ క్షణం.. భారతీయుల ఆనందానికి ఆకాశమే హద్దయింది. చంద్రయాన్–3 విజయవంతం కావడంతో అంతటా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జయహో భారత్.. సాహో ఇస్రో అంటూ యువకులు, విద్యార్థులు సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచారు. చంద్రునిపై విక్రమ్ ల్యాండర్ దిగుతున్న ప్రక్రియను ఇస్రో ప్రత్యక్ష ప్రసారం చేయడంతో అనేకమంది టీవీలకు అతుక్కుపోయారు. మరికొంతమంది తమ మొబైల్ ఫోన్లలోని యూ ట్యూబ్ ఛానెళ్లద్వారా ఈ ప్రసారాన్ని వీక్షించారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై విక్రమ్ దిగిన వేళ దేశమంతా చప్పట్లతో మార్మోగిపోయింది.

గోపాలపట్నం హైస్కూల్లో..

గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విక్రమ్ ల్యాండింగ్ లైవ్‌ను ప్రదర్శించారు. విక్రమ్ ల్యాండర్ చంద్రుడిపై విజయవంతంగా దిగుతున్న దృశ్యాలను ఉత్కంఠభరితంగా వీక్షించారు. సురక్షితంగా ల్యాండ్ అయిన సమయంలో జయహో భారత్ అంటూ నినాదాలు చేశారు.

గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు ముందుగా చంద్రయాన్ అక్షరాకృతిగా ఏర్పడ్డారు.

జయహో భారత్

మల్కాపురం: చంద్రుడిపై భారత జాతీయ పతాకం రెపరెపలాడిన వేళ విద్యార్థులు కేరింతలు కొట్టారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు పాఠశాలల్లో ప్రత్యేకంగా స్క్రీన్లు ఏర్పాటు చేసి, ప్రత్యక్ష ప్రసారం చేయడంతో ఆ ఆనందక్షణాలను వీక్షించారు. చంద్రుడిపై మన విక్రమ్ ల్యాండర్ దిగుతున్న వేళ విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందంతో జయహో భారత్ అంటూ నినదించారు. అమెరికా, రష్యా వంటి అగ్రదేశాలకు సాధ్యం కానీ ప్రయోగాన్ని మన భారత్ చేసి చూపించటంతో అందరూ సంబరాలు చేసుకున్నారు.



తరగతి గదిలో టీవీ స్క్రీన్‌పై చంద్రయాన్-3 ల్యాండింగ్‌ను తిలకిస్తున్న విద్యార్థులు



జీవీఎంసీ ఉన్నత పాఠశాల వద్ద విద్యార్థుల సంబరాలు



జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విక్రమ్ ల్యాండిగ్‌ను లైవ్‌లో వీక్షిస్తున్న విద్యార్థులు

మన సైంటిస్టుల కృషి ఫలించింది



చంద్రయాన్–3 విజయవంతం కావడంతో మన సైంటిస్టుల కృషి ఫలించింది. భారత్ తల చుకుంటే ఇలాంటి అద్భుతాలు మరెన్నో సృష్టించగలదని నిరూపించినట్లయింది. చంద్రుడిపై భారత జాతీయ జెండాను ఎగరవేసిన మన శాస్త్రవేత్తలకు వందనం.

– ప్రకాశరావు, శ్రీహరిపురం జీవీఎంసీ పాఠశాల ఉపాధ్యాయుడు

ఇక ఇస్రో టార్గెట్ ఆదిత్య ఎల్–1



ఇస్రో శాస్త్రవేత్తల కృషితో చంద్రుడిపై విజయవంతంగా కాలు పెట్టగలిగాం. చంద్రుడిపై 14రోజుల పరిశోధనలు సక్సెస్ కావాలని ఆకాంక్షిస్తున్నాం. త్వరలో సూర్యుడిపై అధ్యయనం చేసేందుకు త్వరలో ఆదిత్య ఎల్–1 ప్రయోగం మొదలుపెడతామని ప్రకటించారు. ఇస్రో మరెన్నో విజయాలను సొంతం చేసుకోవాలని కోరుతున్నాం.

– వాసుదేవ్‌రావు, లక్కీ అమర్ పాఠశాల ప్రిన్సిపాల్

కుళాయిలు ప్రారంభం

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లోని విజయ దుర్గా అమ్మవారిని కార్పొరేటర్ బొమ్మిడి రమణ దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో వేసిన కుళాయితో పాటు సాయిబాబా ఆలయంలో వేసిన కుళాయిని ఆయన ప్రారంభించారు. వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి. మురళి, శ్రీనివాసరావు, నరవ పైడిరాజు, శ్రీను పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆస్పత్రి నుంచి రోగి అదృశ్యం

బీచ్‌రోడ్డు: ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన 33 ఏళ్ల రాష్మిత అదృశ్యమైంది. మానసిక పరిస్థితి బాగోలేక ఈ నెల 10న ఆమెను కుటుంబ సభ్యులు మానసిక ఆస్పత్రిలో చేర్పించారు. మంగళవారం ఆమెకు వైద్యం అందించేందుకు సిబ్బంది వెళ్లగా.. రాష్మిత కనిపించలేదు. దీంతో సిబ్బంది మూడో పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. ఆమె 5.5 అడుగుల ఎత్తు, తెలుపు రంగులో ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎవరికైనా కనిపిస్తే మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు.

ఉక్కునగరంలో పాము కలకలం



పట్టుకున్న పాముతో కిరణ్‌కుమార్

ఉక్కునగరం: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయం వెనుక భాగంలో పాము కలకలం రేపింది. బుధవారం ఉదయం ఆలయం వెనుక ఉన్న ఇంట్లో పాము కనిపించింది. దీంతో ఆ ఇంట్లోని కుటుంబీకులు భయాందోళన చెందారు. వెంటనే స్నేక్ క్యాచర్ కిరణ్‌కుమార్‌కు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న కిరణ్‌కుమార్ పామును పట్టుకున్నారు.అటవీశాఖ అధికారులకు అప్పగిస్తానని కిరణ్ తెలిపారు.

మీ సేవా భవనంలో చోరీకి యత్నం



మీ సేవా భవనం ఇదే

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని మీ సేవా కేంద్రంలో దొంగలు పడ్డారు. అక్కడ ఉన్న ఏసీ యూనిట్ బాక్స్‌లు చోరీకి పాల్పడుతుండగా క్రైం పోలీసులు గుర్తించడంతో వారు అక్కడ నుంచి పరార్ కావడానికి యత్నించారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ దొంగతనానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గుల్లలపాలెం వుడాకాలనీ వద్ద పదేళ్ల కిందట మీ సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.అయితే ప్రస్తుతం మీ సేవా కేంద్రాలు మూతపడడంతో ఈ భవనం నిరుపయోగంగా ఉంది. అప్పట్లో కేంద్రం వద్ద నాలుగు ఏసీ యూనిట్లు,10 ఫ్యాన్లు, ఇతర ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. మీ సేవా కార్యకలాపాలు నిలిచిపోవడంతో భవనం వద్దకు ఎవరూ రావడం లేదు.ఇదే అదునుగా చూసుకున్న 63వ వార్డు జైఆంధ్రకాలనీ ప్రాంతానికి చెందిన యువకులు మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మీ సేవా భవనంపై మద్యం సేవించి, ఆ తర్వాత ఏసీ అవుట్ యూనిట్‌ను తొలగించే యత్నం చేశాడు. దీన్ని గుర్తించిన మీ సేవా భవనం ఎదురుగా ఉన్న నివాసీయులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు రావడంతో ఆ దొంగ అక్కడ పరార్ అయ్యే యత్నం చేశాడు.చివరకు ఆ దొంగను పట్టుకుని విచారిస్తే తాను మద్యం సేవించేందుకు వచ్చానని చెప్పడంతో అతని కుటుంబ వివరాలను సేకరించే ప్రయత్నం పోలీసులు చేశారు. దీనిపై విచారణ చేస్తున్నామని విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని క్రైం పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు



ప్రతిభా పోటీల విజేతలతో ప్రిన్సిపాల్ షైజీ, అధ్యాపకులు



విద్యార్థినికి ఉద్యోగ నియామక పత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ద్వితీయ భాషా విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అంతర్ కళాశాలల ప్రతిభా పోటీలు ఉత్సాహంగా సాగాయి. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థుల్లో భావ వ్యక్తీకరణ కౌశలం, ప్రతిభా పాటవాలను ప్రోత్సహించే దిశగా ప్రతిభా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశాఖలోని సుమారు 15 కళాశాలలకు చెందిన విద్యార్థులు వక్తృత్వం, చిత్రలేఖనం, గీతాలాపన, వ్యాసరచన, కథా వాచనం మొదలగు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చూపారు. తెలుగు, హిందీ, ఆంగ్ల మాధ్యమాల్లో వీటిని నిర్వహించారు. డాక్టర్ పి.అరుణాదేవి విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు. సెయింట్ జోసెఫ్, డాక్టర్ వీఎస్ కృష్ణ, గాయత్రి, వినెక్స్, యూనిటీ కళాశాలలు విజేతలుగా నిలిచాయని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ నిర్మల, డాక్టర్ దీప్తి, సిస్టర్ జైన్, కోటేశ్వరావు, గౌరీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు విశేష స్పందన

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో జేకేసీ, నిర్మాణ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. పలు ప్రముఖ కంపెనీలైన ఆటో సైన్స్, టాటా క్యాపిటల్ మైక్రో ఫైనాన్స్, అరబిందో ఫార్మా, వైఎస్‌కే ఇన్ఫోటిక్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీరామ్ ఫైనాన్స్, పేటీఎం, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, టీసీఎల్ సీసాట్ పాల్గొన్న ఈ జాబ్‌మేళాకు 286 మందికి పైగా అభ్యర్థులు హాజరయ్యారు. 66 మంది ప్లేస్‌మెంట్ పొందినట్టు జేకేసీ మెంటార్ వీఎస్ రాజు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో జేకేసీ సమన్వయకర్త డి.అరుణపద్మ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం



మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

సబ్బవరం: విద్యార్థి దశ అనేది ఒక రంగుల కల లాంటిది.. ఆ సమయంలో ఎలాంటి బలహీనతలను దరి చేరనీయకుండా విద్యాభ్యాసం పూర్తి చేసి తమ తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని అనకాపల్లి ఎస్పీ కేవీ మురళీకృష్ణ సూచించారు.దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో మాదక ద్రవ్యాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది జీవితంలో చాలా ముఖ్యమైన దశ అన్నారు. ఈ దశలో అనేక రకాల బలహీనతలు విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. అలాంటి వాటిలో మాదకద్రవ్యాల వినియోగం ఏంతో ముఖ్యమైనదని, ఇలాంటి బలహీనతల్లో వెళ్లకుండా విద్యార్థులు తమను తాము నియంత్రించుకోవడం ద్వారా మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టెన్స్ యాక్ట్–1985 ప్రకారం మాదక ద్రవ్యాల వినియోగం ,వాటిని కలిగి ఉండటం చట్టవ్యతిరేకమైన చర్య అని తెలిపారు. ప్రజల్లో దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించేందుకు టోల్ ఫ్రీ నెంబర్ 14500తో కూడిన హోర్డింగ్‌లను కళాశాలలు, ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేశామన్నారు. గంజాయి అక్రమ రవాణా నివారణలో భాగంగా ఇప్పటి వరకూ జిల్లాలోని 8 మందిపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ శ్రీసుధ, రిజిస్ట్రార్ డాక్టర్ జోగినాయుడు,పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ సత్యనారాయణ, సబ్బవరం సీఐ రంగనాథం, ఎస్ఐ ఎల్. సురేష్, అకడమిక్ డీన్ డాక్టర్ సోమా భట్టాచార్య పాల్గొన్నారు.

కార్పొరేటర్ సురేష్‌పై అట్రాసిటీ కేసు

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్‌పై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. తనకు జరిగిన అన్యాయంపై బాధితుడు సీఎం క్యాంప్ కార్యాలయానికి లేఖ ద్వారా వివరించాడు. అక్కడ నుంచి సమగ్ర విచారణ చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు వచ్చాయని మల్కాపురం పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. 60వ వార్డు గుల్లలపాలెం వుడాకాలనీలోని చింత చెట్టు కింద ములగాడ కనకరాజు అనే వ్యక్తి మిషన్ సాయంతో బ్యాగులు కుట్టుకుంటూ జీవనం సాగిస్తుండే వాడు. అయితే కనకరాజు ఏర్పాటు చేసుకున్న జై భీమ్ బ్యాగుల షాపుపై డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఆ చిత్రపటాలను తొలగించాలని కార్పొరేటర్‌తో పాటు అతడి అనుచరులు వాదించడంతో పాటు కులం పేరుతో దూషించారని బాధితుడు పేర్కొన్నాడు. దీనిపై కక్ష గట్టిన కార్పొరేటర్ ఇటీవల ఆ షాపును సచివాలయం టౌన్ ప్లానింగ్ సిబ్బందితో తొలగించారని ఆవేదన చెందిన కనకరాజు పారిశ్రామిక ప్రాంత దళిత సంఘాల నాయకులు,ప్రతినిధులతో కలిసి తొలగించిన షాపు వద్ద నిరసన చేపట్టారు. దీనిపై మల్కాపురం పోలీసులకు కనకరాజు ఫిర్యాదు చేశాడు. ఇదే అంశంపై సీఎం కార్యాలయానికి లేఖ రాశాడు. కార్పొరేటర్‌పై కేసు నమోదు చేయాలని మళ్లీ ఈ నెల 16న కనకరాజు స్టేషన్‌కు వెళ్లాడు. దీంతో కార్పొరేటర్ సురేష్‌తో పాటు అనుచరులు బిల్డర్ సంతోష్,నేవీ అనీల్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. దీనిపై ఏసీపీ విచారణ జరగాల్సి ఉందని మల్కాపురం సీఐ జి.డి.బాబు చెప్పారు.

‘ఉక్కు’ ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. ప్రజల ఆకాంక్షకు కేంద్ర ప్రభుత్వం విలువనిచ్చి పార్లమెంట్‌లో ప్రకటన చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 923వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో ట్రాఫిక్ విభాగ కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అందరూ కలిసి రావాలని కోరారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఏయూతో ఐసీటీ అకాడమీ ఎంవోయూ



అవగాహన ఒప్పందం చేసుకుంటున్న ఏయూ, ఐసీటీ ప్రతినిధులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఐసీటీ అకాడమీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత సమక్షంలో ఒప్పంద పత్రాలపై బుధవారం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఐసీటీ అకాడమీ సీఈవో హరి బాలచంద్ర సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా ఐసీటీ అకాడమీకి నోడల్ కేంద్రంగా ఏయూ నిలవనుంది. ఏయూ ఆచార్యులకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్–కమ్యూనికేషన్ టెక్నాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో అవసరమైన సేవలను ఐటీసీ అందిస్తుంది. ఈ సేవలను ఏయూతో పాటు అనుబంధ కళాశాలల అధ్యాపకులు పొందే అవకాశం ఉంది. ఏయూ ఆచార్యుల పరిశోధన పత్రాలను ఐసీటీ జర్నల్స్‌లో ప్రచురిస్తారు. కార్యక్రమంలో ఏయూ అలుమ్ని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఇ.శంకర రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహనరెడ్డి

సింధియా: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేసే ప్రతి ఒక్కరిని పార్టీ ఆదరించి అండగా ఉంటుందని 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ సచివాలయ పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో బుధవారం సమావేశం నిర్వహించారు. వై ఏపీ నీడ్స్ జగన్ పై అవగాహన కల్పించారు. భోగవిల్లి నాగభూషణం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం జేసీఎస్ క్యాడర్‌లోని ప్రతి ఒక్కరిరీ రూ. 5 లక్షల ఉచిత బీమా సౌకర్యం కలిప్తున్నారన్నారు. 37000 ప్రభుత్వ పాఠశాలల్లో నాడు–నేడు పనులు, ప్రజారోగ్యం కోసం 1500 పీహెచ్‌సీలు నిర్మించామని, 17 మెడికల్ కాలేజీలు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో నాయకులు సమష్టిగా పని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సోమాదుల సురేష్, కొట్నాన రవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

స్నేక్ క్యాచర్ ఆనంద్ దంపతులకు సత్కారం



స్నేక్ క్యాచర్ ఆనంద్ దంపతులను సన్మానిస్తున్న నాయకులు

సింధియా: విశాఖలో మొదటి స్నేక్ క్యాచర్, కేరళ వాసి ఆనంద్ దంపతులను బుధవారం సాయంత్రం షిప్‌యార్డ్‌కాలనీలోని బాలకృష్ణ కల్యాణ మండపంలో ఘనంగా సత్కరించారు. షిప్‌యార్డ్ జనరల్ మేనేజర్ గుప్తా, కాలనీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ బేగ్, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ఆనంద్ దంపతులకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35 ఏళ్లుగా కాలనీలో కాలనీలో ఎవరి ఇంటికైనా పాము వస్తే సమాచారం అందుకున్న క్షణాల్లోనే చేరుకుని పాములను పట్టుకుని నిర్మానుష్య ప్రాంతాల్లో వదిలిపెట్టే ఆనంద్ సేవలు ఎనలేనివన్నారు. అనుకోకుండా ఆనంద్ తిరిగి కేరళ వెళ్లిపోతున్న సందర్భంగా ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, నాయకులు భోగవిల్లి నాగభూషణం, షిప్‌యార్డ్ గుర్తింపు యూనియన్ నాయకులు, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతి



నీటిపై ఉన్న మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ దేవుడమ్మ



ఎర్ర మృతదేహం

మల్కాపురం: చేపలు పట్టేందుకు వెళ్లి గల్లంతైన ఓ వ్యక్తి.. అదే చోట శవమై తేలాడు. ఈ ఘటనకు సంబంధించి మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. వన్‌టౌన్ రెల్లివీధి ప్రాంతానికి చెందిన మారుపల్లి ఎర్రయ్య(37) ఈ నెల 20న ఎస్‌బీసీ(షిప్ బిల్డింగ్ సెంటర్) ఎదురుగా డాక్‌యార్డ్ వంతెన వద్ద చేపలు పట్టేందుకు వచ్చాడు. ఈ క్రమంలో అతను అక్కడి సముద్ర తీరంలో గల్లంతయ్యాడు. ఈ విషయాన్ని అతనితో వచ్చిన ఓ వ్యక్తి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. గాలింపు చర్యలు చేపట్టారు. అతని ఆచూకీ లభ్యం కాకపోవడంతో.. ప్రత్యేక బృందాన్ని రప్పించారు. సోమ, మంగళవారాల్లో గాలింపు చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. చివరకు బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఎర్రయ్య మృతదేహం నీటిపైకి తేలింది. ఈ విషయాన్ని పోలీసులు అతని బంధువులకు తెలిపి.. శవ పరీక్ష నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసును ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు. కాగా. ఎర్రయ్య మానసిక పరిస్థితి సరిగ్గా లేదని తెలిసింది. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారితో ఎర్రయ్య కలిసి ఉండటం లేదని సమాచారం.